www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 21 జూన్ 2024
5
వైఎస్ఆర్

117 జిఒను రద్దు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : విద్యా శాఖలో జిఒ నంబర్ 117 రద్దు చేయాలని ఆర్‌జెయుపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు కోరారు. గురువారం భుజంగరావు స్మారక ఆర్‌జెయుపి టీచర్స్ హోమ్‌లో రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమం కూడా కొనసాగించాలని కోరారు. గతంలో మాదిరిగా ప్రాథమిక తరగతులు అయిన 3,4,5 కొనసాగించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్. యం.షరీఫ్ మాట్లాడుతూ విద్యాశాఖలో ఖాళీగా ఉన్న అన్ని కేడర్ల పోస్టులను ఉద్యో గోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. సంఘం అధికార ప్రతినిధి ముత్తోజు వీరబ్ర హ్మం నూతనంగా ఏర్పడిన ప్రజా ప్రభుత్వం మెగా డిఎస్‌సి ప్రకటించడంపై హర్షం ప్రకటించారు. ఉపాధ్యాయుల దీర్ఘ కాల సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులరెడ్డి, టీచర్స్‌హోం ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, సీనియర్ నాయకులు వీరయ్య, వీరన్న పాల్గొన్నారు.

ఖర్చులు బారెడు.. మద్దతు జానెడు

- వరికి క్వింటాకు రూ.117 మద్దతు ధర పెంపు
- గతేడాదితో పోలిస్తే రూ.26 తక్కువ
- కేంద్రం మద్దతు ధరపై రైతుల పెదవి విరుపు

ప్రజాశక్తి-చాపాడు

కేంద్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి, జొన్న, పత్తి సహా 14 రకాల పంటలకు కనీస మద్దతు ధర పెంపునకు ఆమోదం తెలిపింది. తాజా పెంపుతో పలు పంటల మద్దతు ధరలలో గతంలో కంటే ఏమాత్రం ఉపయోగం లేదని రైతులు వాపోతున్నారు. సాగు ఖర్చులు విపరీతంగా పెరిగాయని అందుకు అనుగుణంగా గిట్టుబాటు ధరలు పెరగలేదు. జిల్లాలో వరి ప్రధాన పంటగా ఉంది. ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి మొత్తం 3.20 లక్షల ఎకరాల్లో వరి, ఇతర పంటలు సాగవుతున్నాయి. ఖరీఫ్‌లో 1.56 లక్షల ఎకరాలకు పైగా, రబీలో 60 వేల ఎకరాల్లో వరి పంట పండిస్తున్నారు. రెండు సీజన్లలో కలిపి మొత్తం 6 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం దిగుబడి వస్తోంది. రైతుల సొంత అవసరాలకు పోనూ 4 లక్షల టన్నులకు పైగా ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు అమ్ముతున్నారు.

పెరిగిన పెట్టుబడి ఖర్చులు

పంటల సాగు చేసేందుకు రైతులకు పెట్టుబడి భారీగా పెరిగిపోతోంది. పెరిగిన పంట ఖర్చులు గతేడాదితో పోలిస్తే విపరీతంగా పెరిగాయి. గత ఖరీఫ్ సీజన్‌లో దుక్కులకు రూ.6500 ఉంటే, ప్రస్తుతం రూ.ఏడు వేల వరకు చెల్లిస్తున్నారు. పురుగు మందుల కోసం గతేడాది రూ.2,500 ఖర్చు చేయగా, ప్రస్తుత సంవత్సరంలో రూ.మూడు వేల వరకు పెరిగింది. కూలీల కోసం గత ఖరీఫ్‌లో రూ.7,500 వేలు ఖర్చు చేయగా, ఇప్పుడు రూ.ఎనిమిది వేలు దాటింది. ప్రస్తుతం లీటరు పెట్రోల్ రూ.110.68 ఉండగా డీజిల్ రూ.98.39 ఉందని, గతేడాదితో పోలిస్తే పెట్రోల్, డీజిల్ ధరల్లో పెద్దగా మార్పులు లేకపోయినా పంట కాలంలో వినియోగిస్తున్న యంత్రాల అద్దెలు పెరిగాయంటున్నారు. గతేడాది మాదిరి తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉత్పన్నమైతే, ఈ వ్యయం మరింత పెరిగే అవకాశం ఉంది. కోత మిషన్ అద్దె, పొలం నుంచి ఇళ్లకు ధాన్యం తరలించేందుకు ట్రాక్టర్ల అద్దెలూ పెరగాయని రూ.5,500 నుంచి రూ.6,500 వరకు ఉంటుంది.

ఐదేళ్లలో మద్దతు ధర వివరాలు..

సంవత్సరం	పెంపు (రూ॥లో)	సాధారణ రకం వరి క్వింటాకు (రూ॥లో)
2020-21	53	1968
2021-22	72	1940
2022-23	100	2,040
2023-24	143	2,183
2024-25	117	2,300

గతేడాదితో పోలిస్తే రూ.26 తక్కువ

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరపై రైతులు పెదవివిరుస్తున్నారు. వరికి క్వింటాకు రూ.117 మాత్రమే పెంచి చేతులు దులుపుకుందని గతేడాది రూ.143 పెంచగా, ఈసారి రూ.26 తగ్గించి ధర ప్రకటించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభు త్వం పెంచిన గిట్టుబాటు ధరలతో (క్వింటాల్) వరి (సాధారణ రకం) రూ.2,300, వరి (గ్రేడ్-ఎ) రూ.2,320, జొన్న (హైబ్రిడ్) రూ.3,371, జొన్న (మాల్దండి) 3,421, సజ్జలు రూ.2,625, రాగులు 4,290, మొక్కజొన్న రూ.2,225, వేరుశనగ 6,783, పొద్దుతిరుగుడు విత్తనాలు రూ.7280, నువ్వులు రూ.9,267, సోయాబీన్ (పసుపు) 4,892, పెసలు రూ.8,682, పత్తి (మధ్యరకం) రూ.7,121, పత్తి (లాంగ్ స్టెపెల్) రూ.7,521, కంది రూ.7,550, మినుము రూ.7,400కి మాత్రమే చేరాయి. కేంద్ర ప్రభుత్వం ఒకవైపు ఎరువులు, విత్తనాలపై రాయితీ క్రమేణా ఎత్తేస్తోంది. పంట ఖర్చులు పెరిగిన నేపథ్యంలో మద్దతు ధరపై ఆశలు పెట్టుకున్న అన్నదాతలకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రైతులను తీవ్ర నిరాశకు గురి చేసింది.

తగ్గుతున్న సాగు విస్తీర్ణం

గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో సాగు గణనీయంగా తగ్గినది. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగును మరింత పెంచాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో పులివెందుల, మైదుకూరు, కమలాపురం, జమ్మలమడుగు తదితర ప్రాంతాలలో వేరుశనగ, వరి, శనగ తదితర పంటలు సాగు చేస్తారు. మైదుకూరు, ప్రొద్దుటూరు, కమలా పురం, బద్వేలు, కడప తదితర ప్రాంతాల్లో వరితో పాటు పసుపు, మిరప, పత్తి, మొక్క జొన్న, సజ్జ తదితర పంటలను సాగు చేస్తారు. రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో పండ్ల తోటలతోపాటు వరి, చెరుకు, మామిడి, వేరుశనగ, సన్‌ఫ్లవర్, ఇతర కూరగాయల పంటలు విరివిగా సాగు చేస్తారు. 2019 ఖరీఫ్‌లో 73,792 హెక్టా ర్లలో పంటలు సాగు కాగా, 2020 ఖరీఫ్‌లో 1,10,127 హెక్టార్లలో, 2021-22 ఏడాదుల్లో 1,24,000 హెక్టార్లలో పంటలు సాగ య్యాయి. 2023లో సాగు గణనీయంగా తగ్గినది. 70 వేల హెక్టార్లకే పరిమితం అయినది.

అధికమవుతున్న సాగు ఖర్చులు

పసుపు పంట సాగుకు ఎకరాకు రూ.1.20 లక్షల నుంచి రూ.1.70 లక్షల వరకు ఖర్చు అవుతుంది. దిగుబడి మాత్రం 30 నుంచి 35 క్వింటాళ్లు మాత్రమే వస్తుంది.. దుక్కిళ్ళ సమయంలో ధరలు నామమాత్రంగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధరలకు సాగు ఖర్చులు కూడా రావు. రూ.12 వేలకు పైగా పసుపు పంటకు ధరలు ఉంటే ఖర్చులు పోను కాస్త మిగులుతుంది .ప్రభుత్వం పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి.

- రామసుబ్బారెడ్డి, పసుపు రైతు, సీతారామపురం.

ధరల్లో నిలకడ ఉండడం లేదు

వ ం ట ల ం సాగు చేసి అమ్మకాలు చేసే సందర్భంలో ధరలు తక్కువగా ఉంటున్నాయి. రైతులు పూర్తిగా అమ్మకాలు చేపట్టిన తర్వాత ధరలు అమాంతం పెరు గుతున్నాయి. ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధర కల్పించి, అది అమలు అయ్యేలా చూస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. వరి ధాన్యం గత ఏడాది నూర్పిడి సమయంలో 8 బస్తాల ధర రూ.12 వేలు ఉంటే ప్రస్తుతం రూ.20 వేలకు పైగా ధరలు పెరిగాయి. తీరా రైతులు అమ్మకాలు చేసే సందర్భంలో తిరిగి తగ్గుముఖం పడుతున్నాయి. ఇలాంటి వ్యత్యాసం లేకుండా గిట్టుబాటు ధరలు కల్పించాలి.

- అబ్బిరెడ్డి, వరి రైతు, బద్రిపల్లి.

గిట్టుబాటు ధరలకు చట్టబద్ధత కల్పించాలి

ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్‌లలో గిట్టుబాటు ధరలను ప్రకటిస్తూ చేతులు దులుపుకుంటున్నది. దీని ద్వారా రైతులకు ఎలాంటి ఉపయోగం లేదు. గిట్టుబాటు ధర కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నది. ప్రభుత్వం గిట్టుబాటు ధరను పార్లమెంటులో చట్టబద్ధత కల్పిస్తే అందుకు అనుగుణంగా రైతులకు గిట్టుబాటు ధర వస్తుంది లేదంటే వ్యాపారాలు ఇష్టాను సారంగా కొనుగోలు చేపడుతారు. ప్రకటనల ద్వారా రైతులకు ఎలాంటి ఉపయోగం లేదు.

- దస్తగిరిరెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, కడప.

వరి బస్తాలను లారీలోకి ఎక్కిస్తున్న కూలీలు (ఫైల్‌ఫొటో)

జీతాల చెల్లింపు ఉత్తర్వులు ఇవ్వాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

మినిమం టైం స్కేల్ పద్ధతిలో పునర్నియామకం పొందిన 1998, 2008 డిఎస్‌సి ఉపాధ్యాయుల జీతాల చెల్లింపుకు ఉత్తర్వులు ఇవ్వాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు డిఇఒ అనురాధను కోరారు. గురువారం సాయంత్రం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డిఇఒను కలిసి యుటిఎఫ్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ పాఠశాల విద్యా శాఖ కమిషనర్ జూన్ 12న మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులను పునర్నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. ఆ ఉత్తర్వులకు అనుగుణంగా జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వులు ఇస్తేనే ఆ ఉపాధ్యాయుల జీతాలు చెల్లించడానికి వీలవుతుందని చెప్పారు. కావున వెంటనే ఉత్తర్వులు ఇచ్చి ఉపాధ్యాయుల జీతాలు ఆలస్యం కాకుండా చూడాలని కోరారు. డిసిఇబి ద్వారా ప్రతి సంవత్సరమూ ముద్రించే లిస్ట్ ఆఫ్ హాలిడేస్‌ను వెంటనే ముద్రించి పాఠశాలలకు సరఫరా చేయాలని కోరారు. డిఇఒ స్పందిస్తూ ఎంటిఎస్ ఉపాధ్యాయుల సంబంధించిన ఉత్తర్వులు వెంటనే విడుదల చేస్తామని, డిసిఇబి క్యాలెండర్ ముద్రించడానికి డిసిఇబి సెక్రటరీకి వెంటనే సూచ నలు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసి ంహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఏజాస్ అహ్మద్, నాయకులు గాజులపల్లె గోపినాథ్, బత్తుల చంద్రశేఖర్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

డిఇఒకు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

వారసత్వ పరిరక్షణకు దిక్సూచి 'మన చరిత'

ప్రజాశక్తి - కడప అర్బన్

మన జిల్లా సంస్కృతి, వారసత్వ పరిరక్షణతో పాటు పర్యాటకాభివృద్ధికి చరిత బులెటిన్ దిక్సూచి లాంటిదని వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. భారత జాతీయ కళా సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యంలో గురువారం మన చరిత బులెటిన్‌ను ఆవిష్కరించారు. నగరంలోని మానస ఇన్ సమావేశ మందిరంలో ఇంటాక్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ మన జిల్లాలో ఘనమైన వారసత్వ ప్రదేశాలు, చారిత్రక కట్టడాలు, విలక్షణమైన సంస్కృతి, సంప్రదాయాలు ఉన్నాయన్నారు. వీటి పరిరక్షణకు ప్రభుత్వంతో పాటు ఇంటాక్ లాంటి సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సభకు అధ్యక్షత వహించిన కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ జిల్లా వారసత్వ సంపద సంస్కృతి సంప్రదాయాల రక్షణ విషయంలో ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడంతో పాటు ఈ యజ్ఞంలో అందరినీ భాగస్వాములను చేసేందుకు ఈ బులెటిన్ కు రూపకల్పన చేశామన్నారు. వైవీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వర రెడ్డి మాట్లాడుతూ మన ఘనమైన సంస్కృతి సంప్రదాయాలతోనే మన దేశం విశ్వ గురువుగా నిలుస్తోందన్నారు. వారసత్వ రక్షణ బాధ్యతను హెరిటేజ్ క్లబ్బుల ద్వారా రేపటి పౌరులకు అందజేయాలని సూచించారు. సంస్థ పూర్వ కన్వీనర్ ఎస్. ఎలియాస్ రెడ్డి మాట్లాడుతూ మన చరితకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. లయన్ ఖాసింఖాన్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా జిల్లాలోని వారసత్వ సంపద విశేషాలను చరిత ద్వారా అందరికీ చేరువ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బులెటిన్ విడుదలకు సహకరించిన వాసవి గ్రాఫిక్స్ అధినేత లయన్ పి.వి. రమేష్ తో పాటు బాలగొండ గంగాధర్, ఎద్దుల చిన్నప్పరెడ్డి, సగళా బాలకృష్ణ, కొత్తాస్ కుమార్, గౌరీ శంకర్, తాహిన్, మయూరా వెంకటేష్ వర్మ తదితరులను వైవీయూ వీసీ చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు బోగాల కొండారెడ్డి, కె. రాఘవేంద్ర వర్మ, కొండూరు జనార్ధన రాజు, జోజిరెడ్డి, సంజీవరెడ్డి, గురు మోహన్ రెడ్డి, సుబ్బారెడ్డి, డాక్టర్ పుత్తా బాలి రెడ్డి, రాణి, మంజుల రెడ్డి, భారవి పాల్గొన్నారు.

యువజనరంగ సమస్యలు పరిష్కరించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో యువజన రంగ సమస్యలు అనేకం ఉన్నాయని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి. రామన్న, సహాయ కార్యదర్శి వీరనాల శివకుమార్, కమిటీ సభ్యులు కృష్ణ పేర్కొన్నారు. గురువారం విజయవాడలో రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డిని కలిశారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ముద్రించిన 2024 డైరీని ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో యువజన రంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని చెప్పారు. రాష్ట్రంలో క్రీడా మైదానాలు ఏర్పాట్లు, క్రీడలకు బడ్జెట్ కేటాయించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలలో క్రీడా మైదానాలు అభివృద్ధికి నోచుకోక మైదానాలు అనేకం ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. జాతీయ క్రీడలలో రాష్ట్ర స్థాయి పేరు నిలబడాలంటే క్రీడలకు ప్రోత్స హించడం ఎంతో ఆవశ్యకత ఉందన్నారు. అటువంటి క్రీడాకారులు తయారు కావాలంటే క్రీడ ప్రాంగణాలు, క్రీడలకు కోర్సులు ఉండాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న కోచ్ పోస్టులు భర్తీ చేయాలని పేర్కొన్నారు. రానున్న రోజులలో యువజన రంగానికి, క్రీడలకు అధిక ప్రాధాన్యత కల్పించి క్రీడాకారులని ప్రోత్సహించాలని కోరారు.

నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదానం

ప్రజాశక్తి -కడప అర్బన్ : నగరంలోని ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం నారా భువనేశ్వరి, మంత్రి కొల్లు రవీంద్ర జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి, నిరాశ్రయులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోనికి రావడానికి భువనేశ్వరి కూడా ఒక కారణం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ప్రజలకు వివరించారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, ఎన్ఆర్ఐ వెంకటేష్, బలిజ సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు, కడప మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ రెడ్డి, న్యాయవాది భరణి, దండు అనిల్, శివ, అశోక్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జీవితంలో ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క అయినా నాటాలని ఎస్‌టియు జిల్లా కార్యదర్శి నజీబుల కోరారు. గురువారం మున్సిపల్ ప్రాథమిక ఉర్దూ స్కూల్ ఒక్కల్‌పేటలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ జీవితంలో కనీసం ఒక మొక్క అయినా నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఆధునిక ప్రపంచంలో పర్యావరణ కాలుష్యం, నివారణ కోసం కచ్చితంగా మొక్కలు నాటాలని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజ్మెంట్ చైర్మన్ సల్మా, సచివాలయం ఎడ్యుకేషన్ సెక్రటరీ రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

వేతనాల్లో వ్యత్యాసం బాధాకరం

ప్రజాశక్తి - కడప అర్బన్ : కెజిబివిలో కాంట్రాక్టు పద్ధతిలో కంప్యూటర్ ఆపరేటర్స్, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్‌గా సేవలు అందిస్తున్న తమకు వేతనాలలో వ్యత్యాసం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కడపలో వారు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 12 ఏళ్లుగా సేవలు అందిస్తూ ఉన్నామని పేర్కొన్నారు. వేతనాలు కేవలం రూ.14,203 మాత్రమే ఇస్తున్నారని చెప్పారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి వేతనాలు తమకంటే ఎక్కువగా ఉన్నాయని తెలిపారు తమకు వారితో సమానంగా ఇవ్వాలని కోరారు. నూతన ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

దాతల సాయం మరువలేనిది : ఎంఇఒ

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : దాతల సాయం మరువలేనిదని మండల విద్యాశాఖ అధికారి వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు.గురువారం సిఎంఆర్ పల్లెలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు అమెరికాకు చెందిన దాతలు వేంపల్లి మనోజ్ కుమార్ రెడ్డి, మహేశ్వరి పాఠశాలకు బీరువా, విద్యార్థులకు విద్యా సామగ్రి ఉచితంగా అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఇఒ విద్యార్థులు విద్యా సామగ్రి అందజే మాట్లాడారు. దాతలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఎవరైనా దాతలుంటే ముందుకు వచ్చి చదువు కోసం పేద విద్యార్థులకు సాయం చేయాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రతి రోజుకు స్కూలుకు పంపే విధంగా చూడాలన్నారు. పిల్లల చదువు విషయంలో తల్లిదండ్రులు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో పిల్లల చదువు నడవడిక గురించి అడిగి తెలుసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్య ప్రవేశ్ కార్యక్రమ పరిశీలకులు రామాంజనేయరెడ్డి, ప్రధానోపాధ్యాయులు బాలిరెడ్డి, ఉపాధ్యాయురాలు చండీప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

కెఎల్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ఎమ్‌డి డాక్టర్ చంద్ర ఓబుల్ రెడ్డి కోరారు. గురువారం కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ క్లాసుల ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థినులు ఇంటర్ చదివిన వారి కన్నా చదువులో ఎంతో ముందు ఉన్నట్టు తెలిపారు. పాలిటెక్నిక్ అనంతరం ఇంజినీరింగ్ విద్యను కొనసాగించాలని కోరారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి. రత్నమ్మ మాట్లాడుతూ శ్రద్ధతో చదివితే మంచి ఫలితాలు లభిస్తాయని చెప్పారు. కళాశాలలో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కరస్పాండెంట్ కె.రాజేశ్వరి మాట్లాడుతూ తన భర్త శివానందరెడ్డి మహిళల కోసం ఇంజినీరింగ్ కళాశాల స్థాపించారని తెలిపారు. కళాశాలలో చదివిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అన్ని శాఖల విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్‌డి చంద్ర ఓబుల్‌రెడ్డి

'నీట్' ఆరోపణలపై సమగ్ర విచారణ చేయించాలి

ప్రజాశక్తి -పోరుమామిళ్ల

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ను రద్దు చేసి, నీటి పరీక్షల నిర్వహణపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేయించాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వీరపోగు రవి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ యూజీ 2024 ఫలితాల్లో హర్యానాకు చెందిన ఒకే పరీక్షా కేంద్రంలో ఏడుగురు విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ రావడం, వారందరికీ 720/720 మార్కులు రావడంతో ఎన్నో అనుమానాలు వస్తున్నాయన్నారు. అదే సెంటర్‌లో ఎగ్జామ్ రాసిన జాన్వీ అనే విద్యార్థిని 179 ప్రశ్నలను అటెంప్ట్ చేయగా అందులో 163 కరెక్ట్ అయ్యాయన్నారు. ఆమెకు 636 మార్కులు రావాలి కానీ 720/720 ఎలా వచ్చాయంటూ ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఎంతో మంది విద్యార్థులకు సాధ్యం కాని విధంగా 718, 719 మార్కులు రావడం ఆశ్చర్యాన్ని కల్గిస్తున్నాయని పేర్కొన్నారు. దేశం మొత్తం ఒకే పరీక్ష ఉండాలని విద్యార్థులపై ఒత్తిడిని పెంచిం దన్నారు. ఇది పూర్తిగా రాష్ట్రాల హక్కులను కాలరా యడమే అవుతుందన్నారు. నేషనల్ టెస్ట్ ఏజెన్సీ నిర్వహించిన పరీక్షలన్నీటిపై విచారణ జరిపిం చాలన్నారు .పరీక్ష నిర్వహణలో వైఫల్యం చెందిన ఒదుకుగాను ఏజెన్సీని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ నాయ కులు వంశీ, తరుణ్, పవన్, ప్రేమ్, విజయ్ పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్ : సిద్ధవటం మండలం జంగాలపల్లి పంచాయతీలోని వెలుగుపల్లె, జంగాలపల్లె ప్రాథమిక పాఠశాలలు, వంతాటి పల్లె పంచాయతీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వంతాటి పల్లె(మెయిన్) పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అన్ని రకాల విద్యా సామగ్రి అందజేశారు. ఉపాధ్యాయుడు డివిఎస్ ప్రసాద్ రెడ్డి తన తండ్రి, కీర్తిశేషులు ధూళ్ళ వెంకట సుబ్బారెడ్డి (రిటైర్డ్ ఏఎస్ఐ) జ్ఞాపకార్థం ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిద్ధవటం మండల విద్యాశాఖ అధికారి విలియం రాజు, వెలుగుపల్లికి చెందిన కుప్పం సుబ్బారెడ్డి, మాచనూరు వెంకట సుబ్బారెడ్డి జంగాలపల్లికి చెందిన మాజీ సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, పల్లె వెంకటసుబ్బారెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేస్తున్న ఉపాధ్యాయులు ప్రసాద్‌రెడ్డి

సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-గోపవరం : సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించి కార్యాలయ వేళల్లో అందుబాటులో ఉండాలని మండల ప్రత్యేకాధికారి ఎం. నాగరాజు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల, గ్రామ స్థాయి అధికారులతో వ్యవసాయం, ఉపాధి, పారిశుధ్య, తాగునీరు, సీజనల్ వ్యాధులు, పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్, బయోమెట్రిక్ వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎం కిసాన్ నిధులు వారం తరువాత కూడా తమ ఖాతాలో జమకాని రైతులు సమీప రైతు భరోసా కేంద్రంలో తగు ఆధారాలు, ధృవీకరణ పత్రాలతో సంప్రదించాలన్నారు. టిబి టీకాలు, సికిల్ సెల్ అనేమియాపై గురించి వివరించారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం,షఉస్ బడి పిల్లలకు అందించాలన్నారు. డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. బడి ఈడు పిల్లలు తప్పని సరిగా బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉద్దేశాలు, లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ, డిప్యూటీ తహశీల్దార్, మెడికల్ ఆఫీసర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆరోగ్య 'యోగ'మే

- యోగాతో శారీరక, మానసిక దృఢత్వం
- వ్యాధులు దూరం
- యోగా నిపుణులు డాక్టర్ ఆర్.రంగనాధరెడ్డి
- నేడు ప్రపంచ యోగా దినోత్సవం

ప్రజాశక్తి - కడప అర్బన్

నేటి యాంత్రిక యుగంలో అనుక్షణం పరిగె డుతూ జనం అలసి పోతున్నారని, అనేక రకాల వ్యాధులతో బాధ పడు తున్నారని ప్రముఖ యోగా నిపుణులు, మిత్రయోగా సెంటర్ నిర్వాహకులు డాక్టర్ ఆర్.రంగనాధరెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని పుర స్కరించుకుని ప్ర జా శక్తితో మా ట్లాడారు. యోగా తో శారీరక, మాన సిక దృఢత్వం లభి స్తుందని తెలిపారు. రోజురోజుకూ మా నసిక ఒత్తిడి పెరిగి మధు మేహం, అధిక బిపి, కేన్సర్, ఆస్తమా, గుండె జబ్బులు, గ్యాస్ ట్రబుల్ వంటి వ్యాధులతో అనేక మంది సతమతం అవుతున్నారని పేర్కొన్నారు. వీటికి యోగాతో ఉపశమనం లభిస్తుందని తెలిపారు. శరీరాన్ని మనసును అనుసంధానం చేసే చక్కని ప్రక్రియ యోగా అన్నారు. ప్రతి ఒక్కరూ ఇంట్లోనే చేసుకునే వీలున్న సంపూర్ణ వ్యాయామం యోగ అని తెలిపారు. భారతదేశంలో పుట్టిన అతి ప్రాచీన శాస్త్రాల్లో యోగా ఒకటి అన్నారు. క్రీస్తుపూర్వం 400 సంవత్సరాల కిందట పతంజలి మహర్షి యోగాను అందరికీ దగ్గర చేశారని చెప్పారు. ఇందులో అనేక శారీరక, మానసిక రుగ్మతను తొలగించడానికి అవసరమైన యోగాసనాలు, ప్రాణా యామం, షట్‌క్రియలు, బంధాలు, యోగముద్రలు, సూర్య నమస్కారాలు తదితర యోగ ప్రక్రియలు ఉన్నాయని పేర్కొన్నారు. యోగా శరీరంలోని వివిధ వ్యవస్థలను ఒక తాటిపైకి నడిచేలా చేస్తుందని తెలిపారు. తద్వారా పలు వ్యాధుల నుంచి ఉపశమనం కలిగిస్తూ మనిషిని ఆరోగ్యంగా ఉంచు తుంద న్నారు. ప్రతి ఏడాది జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహి స్తున్నారని పేర్కొ న్నారు. యోగా భారతీయ సంస్కృతిలో భాగమైన ప్రక్రియ అన్నారు. యోగా అంటే ప్రపంచానికి భారత దేశం ఇచ్చిన కానుకగా చెప్పవచ్చున్నారు. యోగా దినోత్సవం మన వారసత్వ సంపద గొప్పదనాన్ని ప్రపం చానికి చాటి చెప్పే మహా సంకల్పం అన్నారు. ప్రతికూల ధోరణులకు సరైన విరుగుడు యోగభ్యాసనమని పేర్కొన్నారు. జాతుల మధ్య అంత ర్యుద్ధాలు, సమాజాన్ని అస్థిరపరిచే హింసా త్మక ధోరణులు ప్రబలుతున్న ప్రస్తుత తరు ణంలో మానవాళిని సామరస్య మార్గంలో నడిపించి, శాంతిని నెలకొల్పేది యోగా మాత్రమే అన్నారు. యోగ ద్వారా మనం సోదర భావాన్ని, ఐక్యతను పెంపొం దించవచ్చన్నారు. యోగాతో నేను అన్న ఆలోచన మనం అనే మహాసముద్రంలో సంయోగం అవుతుందని తెలిపారు. ఈ జ్ఞానాన్ని సమా జానికి అందించాలని చెప్పారు. లోకా సమస్త సుఖినోభవంతు అన్న ఉపనిషత్ వాక్యాన్ని నిజం చేయాలని కోరారు.

పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులకు సూచిస్తున్న కమిషనర్

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి పెట్టినట్లు కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. వార్డు పర్యటనలో భాగంగా గురువారం ఆయన వెలమవారిపల్లి గ్రామంలో అధికారులతో కలిసి పర్యటించారు. రోడ్లపై నీరు నిలువకుండా కాలువల ద్వారా వెళ్లే ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అవసరమైన ప్రతిచోట వీధిలైట్లు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామంలో పిచ్చి మొక్కలు లేకుండా చూడాలన్నారు. నీటి సరఫరా గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం కౌన్సిలర్ రంగ నాయకులు, పబ్లిక్ హెల్త్ డిఇ సురేంద్ర, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

147 మంది అభ్యర్థులు ఎంపిక

ప్రజాశక్తి - ముద్దనూరు

తాడిపత్రి రహదారిలో ఉన్న గజ్జల చిన్న రంగారెడ్డి మెమోరియల్ ఐటిఐలో గురువారం కడప కొప్పర్తి వద్ద ఉన్న ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీలో సిసి కెమెరాల తయారీ ఉద్యోగాల కోసం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఐటిఐ ప్రిన్సిపల్ సుబ్బారావు ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధులు వంశీ, సాయి, వినోద్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్ మేళాకు 150 మంది అభ్యర్థులు హాజరుకాగా 147 మంది ఎంపికైనట్లు సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న తహశీల్దార్, సిబ్బంది

ప్రజలకు మరింత సేవలో రెవెన్యూ శాఖ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రభుత్వం ప్రజలకు మరింత విస్తృత సేవలు అందించేందుకు రెవెన్యూ శాఖ ఎప్పటికప్పుడు ముందంజలో ఉందని తహశీల్దార్ భీమేశ్వరరావు పేర్కొన్నారు. సింహాద్రిపురం తహశీల్దార్ గురువారం కార్యాలయంలో రెవెన్యూ శాఖ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాల పరిస్థితులకు అనుగుణంగా రెవెన్యూ శాఖ ప్రజలకు, రైతులకు అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తోందన్నారు. వన్ బి, అడంగల్, ఫీల్డ్ మ్యాప్‌తోపాటు ఆదాయ ధ్రువీకరణ పత్రం, క్యాస్ట్ సర్టిఫికెట్ ఇతరత్రా వాటిని సులభంగా పొందేందుకు మీసేవ, సచివాల వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. రెవెన్యూ శాఖలో ఎప్పటికప్పుడు సమూల మార్పులు తీసుకొస్తూ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ పద్మావతిరెడ్డి, ఆర్ఐ షేక్షావలి, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ నాగార్జునలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జూన్ 20న రెవెన్యూ డేగా ప్రకటించడంతో రెవెన్యూ కార్యాలయంలో ఉత్సవాలను నిర్వహించారు. రెవెన్యూ అధికారుల ప్రతి ఒక్కరూ పంచ కట్టు, చీరలు ధరించి తెలుగుదనం ఉట్టిపడేలా కనిపించారు. రెవెన్యూ కార్యాలయం హరివిల్లుల వంటి ముగ్గులు, తోరణాలతో అలంకరించారు. రెవెన్యూ శాఖలో పదవీ విరమణ పొందిన మల్లు వెంకటస్వామిరెడ్డిని సిబ్బంది సత్కరించారు.

విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ఎఓ రాజేంద్రప్రసాద్

పంట సాగులో విత్తనశుద్ధి తప్పనిసరి

ప్రజాశక్తి - వేంపల్లె

విత్తన శుద్ధి చేసి రైతులు పంటలను సాగు చేస్తే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందని మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో గురువారం ఆయన వేరుశనగ విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఖరీఫ్‌లో వేరుశనగ పంటను సాగు చేసే రైతులు ముందుగా విత్తన శుద్ధి చేయాలని కోరారు. విత్తనశుద్ధి చేసే సమయంలో కిలో విత్తనాలకు ట్రైకోడెర్మావిరిడి మందును కలపాలన్నారు. కిలో విత్తనాలకు నాలుగు గ్రాముల క్లోరిపైరిఫాస్, 6 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ మందులను కలపాలని సూచించారు. విత్తనశుద్ధి చేయడం వల్ల తెగుళ్ళు, పురుగుల ఉధృతిని తగ్గించుకోవచ్చు అన్నారు. విత్తేటప్పుడు దుక్కిలో వేప పిండి లేదా ఆముదం చెక్క 500 గ్రాములు కలిపితే వేరు పురుగును నివారించవచ్చునని తెలిపారు. అధిక ఆదాయం కోసం వేరుశెనగ పంటలో మిశ్రమ పంటగా కంది పంటను కూడా వేయాలని సూచించారు. ప్రధాన పంటలతోపాటు మిశ్రమ పంటలతో కూడా అధిక లాభాలు వస్తాయన్నారు. ఎర పంటగా ఆముదం వేస్తే గొంగళి పురుగు ఉధృతిని తగ్గించవచ్చు అన్నారు. కంచె పంటగా జొన్న, మొక్కజొన్న వేస్తే తామర పురుగు బెడదను తగ్గించవచ్చునని సూచించారు. మొవ్వ కుళ్లు తెగులు రాకుండా నివారించవచ్చన్నారు. పంట సాగు చేసే సమయంలో వేరుశనగ విత్తనశుద్ధి 10 నిమిషాలు ముందు చేసుకోవాలని కోరారు. లేకపోతే విత్తనం పైన పొట్టు లేచి విత్తన మొలక శాతం తగ్గుతుందని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - మైదుకూరు

ప్రొద్దుటూరు రోడ్డులో గురువారం ఉదయం లారీ, ఆటో ఢీకొన్న సంఘటనలో చాపాడు మండలం వెదురూరుకు చెందిన చిన్న బ్రహ్మయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. లారీ అతి వేగంగా ఢీకొట్టి ఆపకుండా వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గాయపడిన చిన్న బ్రహ్మయ్య

మిర్చి రైతులకు ఊరట..

కాసులు కురిపిస్తున్న పంట.. సాగు విస్తీర్ణం తగ్గడమే కారణం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కాలం కలిసి రావడంతో రైతుకు కాస్త ఊరట లభించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతన్నకు మిరప పంట బాసటగా నిలిచింది. ఎట్టకేలకు మిరప పంట రైతు ఇంట కాసులు కురిపించింది. ఈ ఏడాది పచ్చి మిరపకాయల ధరలు నింగిని తాకాయి. కిలో రూ.80 నుంచి రూ.120 వరకు ధరలు పలికాయి. మిర్చి ఘాటెక్కడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంట పండితే ధర ఉండదు.. ధర ఉంటే పంట పండదు ఇది చాలా కాలం నుంచి వస్తున్న పరిస్థితి. పచ్చి మిరప ధరలు ఎప్పుడు ఆకాశానికి చేరుతాయో ఎప్పుడు పతనమవుతాయో తెలియని పరిస్థితి ఉంటుంది. ఒకప్పుడు పచ్చి మిరపకాయలు గిట్టుబాటు కాక రోడ్లపైనే పడవేసిన సందర్భాలు కొల్లలు. ఈ ఏడాది విపరీతమైన ఉష్ణోగ్రతతో మిరప సాగు రైతులు చేపట్టలేకపోయారు. మిరపకాయల కొరత తీవ్రస్థాయిలో ఏర్పడింది. కొంతమంది రైతులు మిరప పంట వేసినా అధిక ఎండలు, ఉష్ణోగ్రతకు మొలక దశలోనే పైరు దెబ్బతినింది. దీంతో మరోసారి మిరప పంట సాగు చేయడానికి రైతులు ఉత్సాహం చూపలేదు. పులివెందుల నియోజకవర్గ పరిధిలో 75శాతం మిరప సాగు కావాల్సి ఉంది. పలు కారణాల వల్ల కేవలం 10 నుంచి 15 శాతం మంది మాత్రమే రైతులు మిరప పంట వేశారు. కాగా పులివెందుల ప్రాంతంలో పండించిన

మిరపకాయలను ఇతర ప్రాంతాలకు కూడా ఎగుమతి చేస్తారు. మిరప పంట ద్వారా అటు రైతులకు ఇటు కూలీలకు కూడా కాస్త ఉపాధి లభిస్తుంది. అయితే వివిధ కారణాల వల్ల మిర్చి సాగు చేయకపోవడంతో మిరపకాయల ధరలు విపరీతంగా పెరిగాయి. ఎంతో కష్టపడి వ్యయ ప్రయాసాలకోర్చి సాగుచేసిన రైతులకు మాత్రం ఉపశమనం ఇచ్చిందని చెప్పవచ్చు. కాలం అనుకూలించడంతో మిర్చి రైతు దశ తిరిగింది.

రోడ్డు బాధితులకు న్యాయం : ఆర్‌డిఒ

బాధితులు, ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

ప్రజాశక్తి - ముద్దనూరు

జాతీయ రహదారి నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణానికి సంబంధించి భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని కమ్మవారిపల్లె గ్రామ రోడ్డు బాధితులు అధికారులను కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఆర్‌డిఒ శ్రీనివాసులు, జాతీయ రహదారి ఇఇ విజయ భాస్కర్‌రెడ్డి రోడ్డు భాదితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ నాలుగు లైన్ల విస్తరణలో భాగంగా భూములను, ఇళ్లు కోల్పోయిన వారికి నష్ట పరిహారం పెంచి న్యాయం చేయాలని కోరారు. నాలుగు లైన్ల ఏర్పాటుకు ఎన్‌హెచ్ అధికారులు చేసిన సర్వేలో ఇళ్లలో సగ భాగం రోడ్డుకు పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన ఇళ్లలో ఎలా ఉండాలని ప్రశ్నించారు. మార్క్ వేసిన వరకు సగం ఇంటిని కూల్చేసి పరిహారం ఇస్తే చాలదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు పూర్తిగా తీసుకుని పరిహారం పెంచి చెల్లించాలని భాదితులు అధికారులను వేడుకున్నారు. మరోచోట స్థలం మంజూరు చేయాలని కోరారు. లేదంటే రోడ్డు అవసరం లేదని తేగేసి చెప్పారు. ఆర్‌డిఒ మాట్లాడుతూ మీ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని న్యాయం జరిగేలా చూస్తామన్నారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. అర్హులైన వారికి మరొక చోట స్థలం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు. జాతీయ రహదారి అధికారులు మాట్లాడుతూ జాతీయ రహదారి నిబంధనల మేరకు ఉన్న వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలు తీసుకుంటామన్నారు. న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సువర్ణదేవి, డిటి సౌజన్య, జాతీయ రహదారి డిఇ శ్రీధర్‌రెడ్డి, ఎఇ దీపక్‌రెడ్డి, సిఐ దస్తగిరి, ఆర్‌ఐ ఎసోబ్, వీఆర్‌ఓ మునెయ్య, టిడిపి నాయకులు శేఖర్ నాయుడు పాల్గొన్నారు.

రైతులకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా వెంటనే రైతులకు ఆర్థిక సాయం అందించాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి కోరారు. తెలంగాణకు చెందిన ఖమ్మం, నల్గొండ జిల్లాల కాంగ్రెస్ నాయకులు దినేష్‌రెడ్డి, సతీష్, ఉపేంద్ర, యూనీస్, గణేష్ గురువారం వేంపల్లెలో తులసిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర రాజకీయాలపై వారితో తులసిరెడ్డి చర్చించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందన్నారు. ఈనెల 22న ఏరువాక పౌర్ణమి పండుగ ఉందన్నారు. ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేలు అందిస్తామని టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందని గుర్తుచేశారు. కర్నూలు నగరంలో ఉన్న మానవ హక్కుల కమిషన్, లోకాయుక్త, వక్ఫ్ ట్రిబ్యునల్, ఎపి ఎలక్ట్రికల్ రెగ్యులేటరీ అథారిటీ తదితర ప్రభుత్వ కార్యాలయాలను అమరావతికి తరలించాలనే ఆలోచనతో చంద్రబాబు ప్రభుత్వం ఉన్నట్లు కొన్ని వార్తలు వచ్చాయన్నారు. ఇది సరైంది కాదని, ప్రాంతీయ వైషమ్యాలకు దారి తీస్తుందని చెప్పారు. ఇప్పటికే రాజధాని, హైకోర్టులలో ఒకటి కూడా రాయలసీమలో ఏర్పాటు కాలేదని పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయ ప్రాంగణం నుండి వైఎస్ఆర్ విగ్రహన్ని తొలగించాలని టిడిపి నేతలు విసికి వినతి పత్రం ఇవ్వడం శోచనీయమన్నారు. వైఎస్ఆర్ విగ్రహన్ని యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసి దాదాపు 16 ఏళ్లయిందన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం వ్యవస్థాపకుడు వైఎస్ఆర్ అన్నారు. ఈ విశ్వవిద్యాలయం వైఎస్ఆర్ మానస పుత్రిక అన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ ద్వారా విద్యా రంగానికి ఆయన చేసిన సేవ అమోఘమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదివి ఉన్నత ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు. అలాంటి విద్యా ప్రదాత వైఎస్ఆర్ విగ్రహన్ని తొలగించాలని చెప్పడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు.

తులసిరెడ్డిని కలిసిన తెలంగాణ కాంగ్రెసు నాయకులు

మంత్రి దృష్టికి విద్యుత్ సమస్యలు : బిటెక్ రవి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలపై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి(బిటెక్ రవి) చర్చించారు. గురువారం విజయవాడలోని సచివాలయంలో విద్యుత్ శాఖ మంత్రిని కలిసి పులివెందులలో గత ప్రభుత్వంలో విద్యుత్ శాఖలో జరిగిన లోపాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పులివెందుల నియోజకవర్గంలో రైతులకు విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు సంబంధిత పరికరాలు అర్హులందరికీ మంజూరు చేయాలని కోరారు.

నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

నీట్ పరీక్ష నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ)ని వెంటనే రద్దు చేసి, ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం వైద్య విద్య ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రంపల్లి అజయ్ మాట్లాడుతూ ఇటీవల నీట్ ఫలితాలు 68 మంది విద్యార్థులు మొదటి ర్యాంకు పొందడం, గ్రేస్ మార్కులు ఇంప్లిమెంటేషన్ చేయడం, జూన్ 14న విడుదల చేయాల్సిన నీట్ ఫలితాలను జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజున ఇవ్వడం చూస్తుంటే నీట్ పరీక్ష సరిగ్గా నిర్వహించలేదనే సందేహాలకు అద్దం పడుతున్నాయని తెలిపారు. నీట్ పరీక్షను వెంటనే రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని, వచ్చే విద్యా సంవత్సరం నుండి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే వైద్య విద్య ప్రవేశ పరీక్ష నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే తమిళనాడు, కేరళ, మరికొన్ని రాష్ట్రాలు నీట్ రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించుకుంటామని ఆందోళన చేస్తున్నా పట్టించుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వైద్య విద్య ప్రవేశ పరీక్ష మన రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజశేఖర్, మండల ఉపాధ్యక్షుడు రమేష్‌పాల్గొన్నారు.

మైదుకూరు : నీట్ పరీక్ష నిర్వహిస్తున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ)ని వెంటనే రద్దు చేసి, ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం వైద్య విద్య ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

రాబోయే రోజుల్లో పార్టీని బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కాంగ్రెస్‌పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిసిసి ఛీఫ్ షర్మిల ఆదేశాలిచ్చారని ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జి నజీర్ తెలిపారు. విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆమెకు నజీర్ స్వాగతం పలికారు. అక్కడి విషయాలు ఫోన్ ద్వారా స్థానిక విలేకరులకు తెలిపారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల గత ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థులతో మాట్లాడినట్లు తెలిపారు. ఎన్నికల అనంతరం జరిగిన పరిణామాలపై సమీక్షించారన్నారు. కాంగ్రెస్‌పార్టీ జాతీయ పార్టీ అని గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కోరారన్నారు.

జమ్మలమడుగు రూరల్ : రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు నియోజకవర్గంలో చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చెప్పినట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాముల బ్రహ్మానందరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ విజయవాడ ఆంధ్రరత్న భవన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలోని ఇన్‌ఛార్జీలతో ఆమె సమీక్ష నిర్వహించారన్నారు. మొన్న జరిగిన ఎన్నికల ఫలితాలను చూసి బయపడవద్దని షర్మిల సూచించారన్నారు. ప్రజల తీర్పును గౌరవించి ముందుకు పోవాలన్నారు.

ట్రిపుల్‌ఐటిలో రిటైర్డ్ ఉద్యోగులను తొలగించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ యూనివర్సిటీ పరిధిలోని ఆయా ట్రిపుల్‌ఐటిలో చెలామణి చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులను తొలగించాలని కాంట్రాక్టు టీచింగ్ అధ్యాపకులు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో ఉన్నతాధికారులుగా రిటైర్డ్ ఉద్యోగులు చెలామణి అవుతున్నారని చెప్పారు. ఉన్నతాధికారులుగా చెలామణి అవుతున్న ఎస్‌డిఓ సుధాకర్ బాబు, సెంట్రల్ స్పాట్ నెంబర్ సత్యదేవ్ స్పాట్ వాల్యుయేషన్‌లో సరైన నిర్ణయాలు తీసుకోవడం లేదన్నారు. న్యాయబద్ధంగా రిక్రూట్ అయిన 2018 బెస్ట్ ఫ్యాకల్టీకి న్యాయం చేయాలని కోరారు. ట్రిపుల్‌ఐటిలను వైసిపి హబ్‌గా ఏర్పాటు చేసుకున్న ఉన్నతాధికారులను తొలగించి విద్యార్థులకు, అధ్యాపకులకు, సిబ్బందికి న్యాయం చేయాలని కోరారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రభుత్వం మారినా, ఇసుక అక్రమ రవాణా అగకుండా నిరాటంకంగా సాగుతోందని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కరుణాకర్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇసుక మాఫియాపై మారిన ప్రభుత్వ ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోందన్నారు. నూతన ప్రభుత్వంలోని రాజకీయ నాయకులకు ఇసుక మాఫియా మధ్య లోపాయికారి ఒప్పందం ప్రజలకు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అక్రమ రవాణాను అడ్డుకుంటున్న రెవెన్యూపైననే ఇసుక మాఫియా బెదిరిస్తుంటే ఉన్నతాధికారులు ఎందుకు చోద్యం చూస్తున్నారని ప్రశ్నించారు. అవినీతిపై ఉక్కుపాదం మోపాల్సిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఎందుకు మౌనం వీడడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నట్లు తెలిపారు. పసిడిపురి ప్రొద్దుటూరులో అవినీతి, అక్రమాలు, అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారి సంపాదనే ధ్యేయంగా సాగుతున్నారన్నారు. అవినీతికి అలవాటు పడిన అధికారులు ప్రొద్దుటూరుకు వచ్చేందుకు ఆరాటపడుతున్నారన్నారు. ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్తామని కరుణాకర్ యాదవ్ ఆ ప్రకటనలో హెచ్చరించారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం..

రూ.కోట్లు విలువ చేసే 32 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని అక్రమార్కుల నుండి కాపాడాలని హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కరుణాకర్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ విషయమై కలెక్టర్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎసిబికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ప్రొద్దుటూర మండలం గోపవరం పంచాయతీ వార్డు నెం.4లోని ద్వారకానగర్‌లో ప్రొద్దుటూరు గ్రామ పొలంలోని 32సెంట్లు విస్తీర్ణం గల ప్రభుత్వ జాగాను 16 మందికి అక్రమంగా విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారని ఆరోపించారు. విషయం బయటికి పొక్కడంతో ఓ పోలీస్‌స్టేషన్ వేదికగా కొంతమంది పంచాయతీ చేసి పోలీసుల సమక్షంలో రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయించి ఇతరులకు కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆరోపించారు. వీటన్నిటిపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారించి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామని కరుణాకర్‌యాదవ్ తెలిపారు.

విద్యార్థికి పుస్తకాల కిట్టును అందజేస్తున్న డిఇఒ అనురాధ

నాణ్యతతో విద్యాబోధన సాగాలి : డిఇఒ

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యతగా బోధించాలని జిల్లా విద్యా శాఖ అధికారి అనురాధ కోరారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాల కిట్లను విద్యార్థులకు డిఇఒ పంపిణీ చేశారు. తరగతి గదులను పరిశీలించారు. అనంతరం డిఇఒ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థికి నోటు పుస్తకాలను పూర్తి స్థాయిలో పంపిణీ చేశామన్నారు. టెక్స్ట్ బుక్స్ 95 శాతం పాఠశాలలకు సరఫరా అయ్యాయన్నారు. ప్రస్తుతానికి విద్యార్థులకు షూ, యూనిఫాం సరఫరాకాక పోవడంతో పంపిణీ చేయలేదన్నారు. యోగా డేలో ప్రతి విద్యార్థి హాజరయేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలన్నారు. పాఠశాల మౌలిక సదుపాయాలపై హెచ్ఎం శివ మునెమ్మను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు జాఫర్ సాదిక్, స్టాలిన్ ఐజాక్, పిఇటి రాజశేఖర్ ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు విద్యార్థులు హాజరు కావాలి

ప్రజాశక్తి - వేంపల్లె

పోటీ పరీక్షలకు విద్యార్థులు హాజరైతే వారిలో ఉన్న నైపుణ్యం బయట పడుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్–ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత, ఉల్లాసాన్ని పెంచుకోవచ్చు అన్నారు. ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఓబుల్ రెడ్డి, డాక్టర్ మల్లేశ్వరమ్మ, హెచ్ఎం నారాయణమ్మ, ఉషారాణి, పిఈటి భారతి, ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు సర్వే నిర్వహిస్తున్న అధికారులు

ప్రమాదాల నివారణకు రోడ్డు సర్వే..!

పులివెందుల నుంచి తిరుపతికి రూట్ మ్యాప్

ప్రజాశక్తి - చక్రాయపేట

ప్రమాదాలు నివారించడానికి రోడ్డు సర్వే నిర్వహిస్తున్నట్లు పులివెందుల స్టెప్ ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ మూలి గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురు వారం పులివెందుల డిఎం రామకృష్ణ ఆదేశాల మేరకు పులివెందుల నుండి వేంపల్లె, లక్కిరెడ్డిపల్లి, రాయచోటి, పీలేరు, బాకరాపేట మీదుగా తిరుపతికి వెళ్లే పులివెందుల ఆర్టీసీ బస్సులో సర్వే నిర్వహించారు. సర్వే నివేదికను రోడ్లు భవనాల శాఖ మంత్రికి అందజేస్తామని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీరన్నగట్టుపల్లె క్రాస్ నుండి రాయచోటి వరకు అధ్వానంగా ఉన్న రోడ్లు పనులు వేగవంతంగా పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు.

రక్తదాన శిబిరంలో వాసవిక్లబ్ సభ్యులు

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - దువ్వూరు

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో దువ్వూరులో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు క్లబ్ ప్రెసిడెంట్ దేవత ఉపేంద్ర తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేసిన వారికి ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. 20 మందికిపైగా రక్తదానం చేశారని వివరించారు. సురక్ష వాలంటరీ బ్లడ్ సెంటర్ ప్రొద్దుటూరు వారి ద్వారా ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈపూరి సత్యనారాయణ, బచ్చు సత్యనారాయణ, కందుకూరి మహేంద్రనాథ్, రాయవరం చంద్రశేఖర్, కొప్పోలు కిషోర్, పేర్ల శేషయ్య పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

విద్యతోనే దళితుల అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - ఖాజీపేట

బడుగు, బలహీన వర్గాలు అభ్యున్నతి చెందాలంటే విద్యతోనే సాధ్యమని పద్మ మహిళ మండలి అధ్యక్షురాలు చిన్న అమ్ములు అన్నారు. గురువారం మండలం పరిధిలోని బుడ్డాయపల్లి గ్రామంలోని దళిత కుటుంబాలకు చిన్న అమ్ములు ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పద్మ మహిళ మండలి ఏర్పడింది బడుగు బలహీన వర్గాలకు సేవ చేసేందుకే అన్నారు. ప్రతి సంవత్సరం తమ పరిధిలోని పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ముఖ్యంగా మహిళలు తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో జీవారత్నం, ప్రమీల పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు తెలుస్తోంది. దుకాణంలోని సుమారు రూ.3 లక్షలకుపైగా నగదును అపహరణకు గురైనట్లు సిబ్బంది ఉన్నతాధికారులకు తెలిపారు. పోలీసులు, ఎక్స్ఛేంజ్ శాఖ సిబ్బంది నగదు అపహరణపై విచారణ చేపడుతున్నారు. మద్యం దుకాణం పైవైపున స్టీల్ రేకులను తొలగించి దుండగులు లోపలికి దూకి నగదును అపహరించినట్లు గుర్తించారు. పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నారు. కేసు నమోదు చేయకుండా షాప్‌లో పనిచేస్తున్న సిబ్బంది నగదు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. గురువారం పూర్తిగా మద్యం అమ్మకాలు నిలిపివేయడంతో మందుబాబులు ప్రొద్దుటూరు, మైదుకూరు దుకాణాలకు వెళ్లాల్సి వచ్చింది.